# అడ్డంగా దొరికిన గడ్డం

- డబ్బు సంచులతో చిక్కిన వివేక్ కంపెనీ ఉద్యోగులు
- హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తుండగా పట్టుకున్న పోలీసులు
- రూ.50 లక్షలు స్వాధీనం.. చెన్నూర్ ఎన్నికల కోసమేనంటూ అంగీకారం
- 'హస్తం'లో అయోమయం
- మండి పడుతున్న ప్రజలు




నగదు తరలిస్తూ పట్టుబడ్డ వివేక్ సంస్థ ఉద్యోగులు

మంచిర్యాల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కోట్ల రూపాయాల నోట్ల కట్టలు తెచ్చి.. ప్రజాస్వామ్య విరుద్ధంగా చెన్నూర్ నియోజకవర్గ నాయకులు, ప్రజలను కొనాలని చూస్తున్న గడ్డం వివేక్ అడ్డంగా దొరికిపోయాడు. మొన్నటి వరకు బీజేపీ మోచేతి నీళ్లు తాగిన ఆయన.. ఊసరవెల్లిలా రంగు మార్చి ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి.. డబ్బు మదంతో ఎలాగైనా గెలిచేందుకు కుట్రలు మొదలుపెట్టిండు. ఇతర పార్టీల మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను అంగట్లో సరుకుల్లా కొంటున్నడు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వివేక్ కంపెనీల నుంచి స్థానిక వ్యాపారులకు డబ్బులు పంపి, అక్కడి నుంచి పంపిణీ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. వివేక్ వెంకటస్వామి, ఆయన కుటుంబ సభ్యుల కంపెనీలు, బంధువుల బ్యాంక్ ఖాతాలపై నిఘా పెట్టాలని కోరారు. వివేక్ పేరు మీద ఉన్న ఓ సూట్ కేస్ కంపెనీకి సోమవారం రూ.8 కోట్లు బదిలీ అయినట్లు ఆరోపించారు. ఈ మేరకు పూర్తి ఆధారాలు ఎన్నికల సంఘానికి అప్పగించారు. మీడియా సంస్థకు చెందిన ఉద్యోగులు రూ.50 లక్షలు తరలిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీసులకు చిక్కారు.

### వివేక్ ఆగడాలకు ఉద్యోగులు బలి..

వివేక్ ఎన్నికల వైకుంఠపాలిలో ఆయన సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు బలి పశువులుగా మారుతున్నారు. ఉప్పల్‌లో బుధవారం డబ్బులతో దొరికిన ఇద్దరిలో ఒకరు వివేక్ వెంకటస్వామికి చెందిన విశాఖ ఇండస్ట్రీస్‌లో పనిచేసే జూనియర్ ఎగ్జిక్యూటివ్ కంజుల రవికిషోర్ కాగా, మరొకరు ఆయన మీడియా సంస్థలో మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే ముదిగంటి ప్రేమ్‌కుమార్ కావడం గమనార్హం. ఈ ఇద్దరిని పోలీసులు డబ్బులు ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా, చెన్నూర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పట్టుబడిన రూ.50 లక్షలను, రెండు మొబైల్ ఫోన్లను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ.50 లక్షలు పట్టుబడ్డాయన్న వార్తలు చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఏ వాట్సాప్ గ్రూప్ చూసినా, ఏ సోషల్ మీడియా వేదికను చూసిన ఈ వార్తే కనిపించింది. దీంతో చెన్నూర్‌లో పొలాల్లో పని చేసే కూలీల వరకు విషయం వెళ్లిపోయింది. రూ.50 లక్షలు దొరికినయంట కాంగ్రెస్ ఆయనవి.. గా సొమ్ము అంతా మొన్న పార్టీలో చేరిన నాయకులకు పంచేందుకు తెస్తున్నరంట.. మంచిగైంది వీళ్లకు అనే చర్చ సాగింది. పైసలతో నాయకులు, ఓట్లను కొనడం ఏమిటని జనాలు సైతం మండిపడుతున్నారు. ఎన్ని కోట్లు ఉంటే ఏం లాభం ఇక్కడ గెలిచిపిచ్చినప్పుడు మనకోసం ఏమన్న చేసిండా.. ఏం చేయలేదు కదా.. ఇప్పుడు కోట్లు తెచ్చి పంచినంత మాత్రం గెలుస్తడా అంటూ ఏ ఇద్దరు కలిసినా ఇదే విషయం చర్చించుకోవడం కనిపించింది. ఇప్పటికే జనాదరణ లేక నాయకులు కొనుగోలు చేసి ఎన్నికల్లో గెలుద్దామనే పగటి కలలు కంటున్న కాంగ్రెస్ అభ్యర్థికి.. ఇప్పుడు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఉన్న కాస్త పరువు పోవడంతో ఆయన కంగారుపడిపోతున్నట్లు తెలిసింది. టికెట్ ఇచ్చిన నాటి నుంచి నాయకులను కలవడం.. వాళ్లను అర్రస్ పాడటం తప్ప పెద్దగా ప్రజల్లోకి ప్రచారం చేయని ఆయన, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి పోతాడనేదే పెద్ద సందేహంగా మారింది. దీనికి గడ్డం బ్యాచ్ ఏమని ప్రజలకు సమాధానం చెబుతుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. మరోవైపు వివేక్ డబ్బులకు ఆశపడి ఆయన వెంట కాంగ్రెస్‌లో చేరినోళ్లకు టెన్షన్ మొదలైంది. మాకు ఇస్తామన్న డబ్బులు ఇస్తారా.. లేదా అని కొందరు నాయకులు భయపడుతున్నారు. మరోవైపు మాకు కమిట్‌మెంట్ ఇచ్చిన పైసలు ఇస్తేనే కాంగ్రెస్‌లో ఉంటం.. లేకపోతే మా దారి మేం చేసుకుంటామని కొందరు నాయకులు ఇప్పటికే సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. ఈ పరిస్థితులన్నీ వివేక్‌కు తలనొప్పిగా మారుతుండగా.. ఎప్పటిలాగే చివర్లో కాడే వదిలేయడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే కాంగ్రెస్ పార్టీ చెన్నూర్‌లో హస్తం మాయం అవుతుందన్న చర్చ సైతం నడస్తున్నది.

# ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు భయపడొద్దు
- ఎస్పీ సురేశ్ కుమార్



కుమ్రం భీం, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఈనెల 30న జరుగన్న శాసన సభ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సురేశ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా స్వామ్యంలో ప్రజల చేతిలో ఉన్న ఆయుధంలాంటి ఓటుని ప్రజలు నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం మావోయిస్టు పేరుతో విడుదలైన లేఖ విషయంలో ఎస్పీ స్పందించారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఓటర్లు, పోలింగ్ నిర్వహణకు పూర్తి భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్న మావోయిస్టులకు తగిన జవాబు ఇవ్వడానికి పోలీసుశాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎల్లప్పుడు పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరిస్తారని ఆయన ఎస్పీ పేర్కొన్నారు.



సీసీఐ ద్వారా నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెటింగ్ అధికారి గజానంద్


# నాణ్యమైన పత్తి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి

- మార్కెటింగ్ అధికారి గజానంద్

ఆసిఫాబాద్,నవంబర్16 : రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పత్తి తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ అధికారి గజానంద్ తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతులు అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ ప్రతినిధి వెంగల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ ఆహ్మద్ ఖాన్, మిల్లు ఓనర్లు అరుణ్‌కుమార్, చిలువేరు గంగన్న, ప్రవీణ్, తుడూరి కృష్ణ, సీసీఐ సిబ్బంది, మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథి.. నీకిదే మా హారతి

తాండూర్, నవంబర్ 16 : 'ఆసరా ఇచ్చి కొడుకయ్యావు..సంక్షేమ పథకాలతో దిక్కయ్యావు అందుకే నిన్ను మా గుండెల్లో నిలుపుకుంటాం.. నిత్యం కొలుచుకుంటాం'.. ఈసారి కూడా నువ్వే ముఖ్యమంత్రి కావాలంటూ వృద్ధులు, ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నీరాజనాలందిస్తున్న దృశ్యమిది. మండలంలోని గోపాల్‌రావుపేటలో బుధవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ ప్రచార రథంపై ఉన్న ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాన్ని చూసిన వృద్ధులు, గ్రామస్తులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తమకు అండగా నిలబడుతున్న సీఎం కేసీఆర్‌కి ఓట్లు వేసి అండగా ఉంటామని మొక్కుతూ కనిపించారు.



తాండూర్ : గోపాల్‌రావుపేటలో ప్రచార రథంపై ఫ్లెక్సీలో ఉన్న సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వృద్ధులు, గ్రామస్తులు



బీఆర్ఎస్‌లో చేరిన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి విరమించుకున్న చకినారపు కిరణ్‌తో అభ్యర్థి బాల్క సుమన్

# నేడు నాగుల చవితి

- శివాలయం, పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

చెన్నూర్ టౌన్, నవంబర్ 16 : భారతీయ సంప్రదాయంలో నాగదేవత ఆరాధనకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. ప్రకృతిని ఆరాధించడం మన సంప్రదాయం..ప్రాచీన కాలం నుంచి అనాదిగా వస్తున్నది. కార్తీక మాసంలో ముఖ్యమైన దివ్యమైన వ్రతం వచ్చే తిథిగా నాగుల చవితిని పేర్కొంటారు. కార్తీక మాసంలో శుక్ల పక్షంలో చతుర్థి (చవితి) తిథిని నాగ చతుర్థి (నాగుల చవితి) గా పిలుస్తుంటారు. పుట్టకు పూజ చేసే పండుగైన నాగుల చవితిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోనున్నారు. తెల్లవారుజామున లేచి స్నానమాచరించి, పుట్టల్లో పాలు పోసి, నాగ సర్పాలను ప్రత్యేకంగా పూజిస్తుంటారు. శుద్ధ జలం, పంచామృతాలు కానీ, ఆవు పాలతో అభిషేకిస్తుంటారు. నాగుల చవితి జరుపుకోవడంలో ముఖ్యంగా ఆరోగ్య రహస్యం, ఆ ప్రాణులతో అనుబంధం కనిపిస్తుంటాయి. సామాజికంగా ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకోగలిగే స్థితి వస్తుంది. ఇలా బహుళార్థక ప్రయోజనాలున్న పండుగగా నాగుల చవితిని ప్రాచీనులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఆలయాన్ని ఏర్పాటు చేసి విగ్రహాలను కూడా ప్రతిష్టించి పూజిస్తుంటారు.

- **పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు**

నాగుల చవితికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చెన్నూర్‌లోని శివాలయంలో ఉన్న నాగదేవత విగ్రహాలను శుభ్రం చేశారు. ప్రాకారంలో ఉన్న సర్ప ప్రతిమలను అలంకరించారు. పట్టణంలోనూ పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు.



చెన్నూర్ టౌన్ : శివాలయంలోని నాగదేవత విగ్రహాలు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- బీఆర్ఎస్‌లో చేరిన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి విరమించుకున్న చకినారపు కిరణ్
- చెన్నూర్‌లో ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్
- బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

చెన్నూర్, నవంబర్ 16: చెన్నూర్ పట్టణంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ కోరారు. చెన్నూర్ పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి విరమించుకున్న చకినారపు కిరణ్ పార్టీలో చేరగా. కిరణ్‌కు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటి నుంచి విస్తృతంగా పని చేస్తూ బాల్క సుమన్ విజయానికి కృషి చేస్తానని కిరణ్ తెలిపారు. పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల పార్టీ కార్యాలయంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ చేరారు. వీరందరికీ బాల్క సుమన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని రెండు హమాలీ సంఘాల సభ్యులు, పేయింటర్స్ అసోసియేషన్ సభ్యులు బీఆర్ఎస్ చేరారు. అనంతరం పట్టణంలోని రజకవాడ, మహంకాళివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా అక్కడ కూడా పలువురు బీఆర్ఎస్ చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.